# వేళగాని వచ్చిన మనిషి

**రచన: శ్రీ విజయలక్ష్మీ రామకృష్ణన్**

రాత్రి ఇంకా తొమ్మిది కాలేదు. భోంచేసి తలుపులు మూసుకుని గదిమధ్య దీపం ఆర్పి, మంచందగ్గరగా వున్న బల్లమీద లైటు వేసుకుని, పడుకుని, చదువుకోడం మొదలుపెట్టింది కాంచన. హరికెన్ లాంతరు బాగా తగ్గించి గదిమూలగా పెట్టింది. మూడు రోజులుగా నగరంలో గాలివాన కారణంగా కరెంటు 'వచ్చే-పోయే'దిగా వుంది. ఈదురు గాలి మోత రాక్షసి మాదిరి చప్పుడు లాగ వుంది. రోడ్లప్రక్కల ఊరూ పేరూ లేని చెట్లుకూడ గాలికి పడి, వ్రేళ్ళు కూడ బైటపడగానే, ఫోటోలు తీయించుకుని పేపర్లకెక్కాయి. కాంచన మేనత్త వరలక్ష్మి ప్రక్కగదిలో పడుకుంది... అప్పుడే నిద్రపోయింది కూడాను. చదువుకుంటున్న కాంచన తలుపుచప్పుడు విని పుస్తకం మూసి లేచికూర్చున్నది. పరీక్షగా విన్నది. తనయింటి తలుపే! సందేహం లేదు. "యింత వానలో, యీ వేళ్ళకు ఎవరబ్బా." అనుకుంది. తలుపు కొంత తీసి ఒకరెక్క చేత్తో పట్టుకుని ఎవరూ?" అన్నది. జల్లువాన లోపలకు వచ్చి క్షణంలో కాంచన, ముఖమూ, పమిటా తడిసిపోయాయి. "వానలో తడుస్తున్నాను; లోపలకు రానిస్తే, ఈ రాత్రి పడుకుని తెల్లవారే వెళ్ళిపోతాను." అన్నాడు తలుపవతలి మనిషి. కాంచన తెల్లబోయింది. "ఏమిటీ సంఘటన? దేవుడిచ్చిన పరీక్ష కాదుకదా." అనుకుంది.

మొండి ధైర్యం అవహించిదామెను. తలుపురెక్క వదిలి "చప్పున రండి లోనికి, జల్లుకు యిల్లు తడుస్తోంది." అని వెనకకు జరిగింది. అపరిచితుడు లోపలకు వచ్చి తలుపు గడియపెట్టాడు. కాంచనకు ఏమి చెయ్యాలో తోచలేదు. ఆ మనిషి బట్టలు నీళ్ళుకారుతూ హాల్లో మడుగయ్యింది. కాంచన "అదిగో, ఆ బాతురూంలోకి వెళ్ళి మీ బట్టలు పిండుకొండి ముందు." అన్నది.

మారుమాట్లాడకుండా అతడు స్నానాల గదిలో కెళ్ళాడు. కాంచన గబగబా ఒకగోనె పట్టా తెచ్చి మడుగైనచోట పరిచింది. అల్మైరా తెరిచి ఒక తుండుగుడ్డ తీసింది. 'అతనికి కట్టుకోడానికి ఏం యిచ్చేది?' అనుకుంది. నవ్వు వచ్చిందామెకు. బాతురూమునుంచి బైటకు వచ్చిన ఆగంతకునితో "చూడండి, ఆ స్టూలుమీద తువాలు పెట్టాను. తలా, ఒళ్ళూ తుడుచుకుని ఆ తెల్లదుప్పటి కట్టుకోండి. మీ బట్టలు ఆపైన తీగమీద ఆరవేసుకొండి. తెల్లారికి ఆరిపోతాయి. పాలు తోడుపెట్టేశాము; టీనో, కాఫీనో చెయ్యడానికిలేదు. హార్లిక్సు బల్లమీద పెట్టాను. తీసుకోండి." అన్నది కాంచన.

అతడు ఏం వినిపించుకోకుండా ఎదరుగా కనబడిన ప్లేటులో బిస్కట్లు గబగబా తినేసి, హార్లిక్సు త్రాగాడు. కాంచన ఆశ్చర్యంగా అతన్ని చూస్తూ నిలబడింది. అతడు నిలుచున్న వైనం, అతడు తింటున్న తీరూ చూసి ఏదో గుర్తుకువచ్చి చకితురాలైంది.

'నిజమేనా! ఏమిటీవింత! కావాలనిరాలేదు కదా!' అనుకుంది. హార్లిక్సు ముగించాక అతనికి కొంత తెలివొచ్చింది. గబగబ తువాలుతీసుకుని తల, ఒళ్ళు తుడుచుకున్నాడు. "దుప్పటి యిచ్చారు దేనికి?" అన్నాడు.

కాంచన "క్షమించాలి. మా యింట్లో మగవాళ్ళకు పనికివచ్చే బట్టలేమీ లేవు మరి. తెల్లారేసరికి ఆరిపోతాయిలెండి." అన్నది.

సర్పద్రష్టుడైనట్లు అతడు వులిక్కిపడి "క్షమించాలి, నా సాహసాని కేమనుకోకండి. పనిమీద యీవూరు వచ్చాను. వానకు గండ్లుపడి రైళ్ళు ఆగిపోవడంతో మొన్ననే మావూరు చేరవలసినవాణ్ణి, యిక్కడే దిగబడిపోయాను. రాత్రి హోటలుదగ్గర ఎవరో నాజేబు కత్తిరించి, పర్సు కాజేశారు. ప్రొద్దుటినుండీ కాఫీ కూడా త్రాగలేదు. ఆకలిగా వున్నది. ఇంటికి టెలిగ్రాం యిచ్చి డబ్బు తెప్పించుకోవచ్చు కాని, వైరివ్వడానికి అప్పిచ్చేవాళ్ళుకూడా యీవూళ్ళో ఎవరూ లేరు నాకు. ఆకలీ - వానలో తడవడం - మొండిధైర్యంగా మీతలుపు తట్టాను. ఇవాళ మీరిచ్చిన హార్లిక్సుకు మించిన విలువైన విందు నే నెరుగను. మీకు కష్టం కలిగించను. వెళ్తాను. చాల కృతజ్ఞుణ్ణి."

కాంచన అప్రతిభురాలై వింటున్నది.

అతడు తలుపుతెరిచేసరికి ఆమె వులిక్కిపడింది. ఒళ్ళుతెలియలేదామెకు. గబుక్కున ముందుకు దూకి అతని చెయ్యి పట్టుకున్నది. జ్వరంతో కాలిపోతున్నదతని ఒళ్ళు. ఆమెకు ఏడుపు వచ్చింది. "ఫరవాలేదు, యీరాత్రికి

పడుకోండి. దుప్పటి కప్పుకోడానికి నా మోపి పడక్కరలేదు ఒక్కరాత్రికి. ఈ యింట్లో మీరు పడుకుంటే నా సచ్చరిత్రకు కళంకము అంటదు. మా మేనత్త నాకు తోడువున్నది. మీకు సందేహ మక్కరలేదు! నా తలుపు తట్టినవాళ్ళను, యిటువంటి చీకటిరాత్రిలో, యింత జడివానలో, త్రిప్పపంపి సత్కీర్తిని సంపాదించుకోలేను," అన్నది. ఆమె గుప్పెటలోని అతనిచెయ్యి వణికింది.

వెంటనే "మీరు, మీరు –" అని మాట పూర్తి చెయ్యలేక తడబడ్డాడు. ఆమె అతని చెయ్యి వదిలి ముఖం ప్రక్కకు త్రిప్పేసుకుని గదిలోకి వెళ్ళింది. రెండు నిముషాలపాటు అతడలా నిల్చునిపోయి, తర్వాత దుప్పటి పంచలాగా చుట్టుకుని, తడిపంచె, షర్టు దగ్గిరా తీగమీద అరవేసివచ్చాడు. హాల్లో మడతమంచంమీద దుప్పటి పరిచి ఒకప్రక్క దిండూ, ఇంకోప్రక్క రగ్గూ అమర్చింది కాంచన. ఆలోచనకుకూడా పనికిరానంత నీరసంగా వున్న దతని మనసు. పడుకుని రగ్గు కప్పుకున్నాడు. కాసేపటికి ఏదో చప్పుడు కాగా కళ్ళు తెరిచి చూచాడు. కాంచన లోపలవైపున తాళం వేసి వెళ్తున్నది.

"ఏమిటింత అక్కర ఈమెకు నామీద?" అనుకున్నాడు. ధైర్యంగా "కాంచనా!" అన్నాడు. కాంచన బదులాడలేదు; వెనక్కి తిరిగి చూడలేదు. వినబడనట్టే గదిలోకి వెళ్ళి గడియపెట్టుకుంది. అతడు నిట్టూరుస్తూ "కాదు, పొరపడ్డాను. ఎవరో యీమె! కాంచన అందం చెడిందని విన్నాను; కాని యింతగా చెడిపోయివుండదు!" అనుకు న్నాడు. తలనిండా ముసుగు పెట్టుకున్నాడు. కాంచన వెళ్ళి పడుకున్నదేకాని ఆమె కన్ను మూతపడలేదు.

తెల్లవారి ప్రొద్దున షేనకోడలుకు కాఫీ తెచ్చిస్తూ, "రాత్రి ఏవేళకు వచ్చాడు రాంబాబు? నేను చూడనేలేదు," అన్నది వరలక్ష్మి. రాంబాబు కాంచనకు పినతల్లి కొడుకు. అడపాదడపా ఆ యింటికి వచ్చే చుట్ట మత డొక్కడే.



"రాంబాబుకా దత్తయ్యా!" అంది. కాంచన.

"అయితే ఆ పడుకున్న దెవరూ?" అంది వరలక్ష్మి.

కాంచనకు ఎట్లా చెప్పాలో, ఏం చెప్పా తెలిసిందికాదు. పెగల్చుకుని, "ఆయ సారధిగారు," అంది.

వరలక్ష్మి ఆశ్చర్యపోయి "సారదేవి



రాత్రి రావడ మేమిటి! సరిగ్గా చెప్పు,''అంది. కాంచన. సారధి ఆ యింటికి ఎట్లా వచ్చిందీ వివరదపరిచింది.

వరలక్ష్మి కాసేపయ్యాక "కాంచీ, నిన్ను గుర్తుపట్టాడా ?'' అ నడిగింది.

"లే ద త్తయ్యా!'' అంది కాంచన.

వరలక్ష్మి నిట్టూరుస్తూ, ''రాత్రి చీకట్లో గుర్తు తెలిసివుండదు. సరిగ్గా



ఏడేళ్ళయింది మొన్నశ్రావణమాసానికి. సరే, అతను లేస్తే నువ్వు కనపడకు. నేనిస్తాలే కాఫీ. రైలుచార్జీకి పాతికో పరకో యిచ్చి పంపిద్దాం.'' అంది.

కాంచన గుండె బరువెక్కిపోయింది. ఆమె బదులు చెప్పలేదు.

తొమ్మిదిన్నరకల్లా వంట పూర్తిచేసి మేనకోడలిని భోజనానికి పిల్చింది వరలక్ష్మి.

కాంచన వంటింట్లోకి వచ్చి, ''ఆయ నింకా లేవలే దేమి టత్తయ్యా ?'' అంది.

వరలక్ష్మి, ''నే నీ వంటగొడవలో ఆ సంగతే మర్చి పోయాను. యింకా లేవకపోవడ మేమిటి ? నే చూస్తాలే ఏదో ఒహటి! దారినపోయే తద్దినాన్ని యింటికి పిల్చుక రావడంలో గొప్పదానివి!'' అంది.

కోపంగా, ''ఛీ.ఏమి టా మాట లత్తయ్యా, నువ్వే చూడనక్కరలేమలే, నేనే వెళ్ళిలేపుతా !" నంది కాంచన

వరలక్ష్మికి కాంచన మనసు అర్థమైంది. ''సంతోషిం చాంలే తెలివికి! ముందు భోంచేసి స్కూలుకు వెళ్ళు. నేన వెళ్ళి చూస్తా నతని పని! కాస్త ఒళ్ళు దగ్గరిపెట్టుకో అతనికి పెళ్ళాం బిడ్డలూ వున్నారు,'' అంది. కాంచన పీ వాల్చుకు పళ్లెం పెట్టుకుంది. వరలక్ష్మి చెంగుతో చేతు తుడుచుకుంటూ హాల్లోకి వెళ్ళింది. తలనిండా ముసుగుదన్ని పడుకున్న మనిషిని ఎట్లా లేపాలో తెలియలే దామెకు అతన్ని పేరుతో పిలువబుద్ధికాలే దామెకు, ''ఇంకా పడు కున్నారా? చాల పొద్దెక్కింది; పదికాబోతూంది; యిం లేస్తారా ?" అంది అతని నుద్దేశించి.

అట్లా రెండుమూడుసార్లు అరిచిన తర్వాత సార ముఖంమీది రగ్గు తొలగించాడు. అతని ముఖమం చెమటతో తడిసిపోయింది. కళ్ళు తెరిచాడుకాని మూసు పోతున్నాయి. వరలక్ష్మికి భయం వేసింది. ఇంట్లో వెళ్ళింది. కాంచన పళ్ళెంలో అన్నం పెట్టుకోకుం మోకాలిమీద తల ఆన్చుకుని కూర్చునుంది. ''అత జ్వరంలాగా వున్నది. ఏమిటిప్పుడు చెయ్యడం ?" అం

కాంచనకు రాత్రి అతని చేతి వేడి గుర్తుకు వచ్చిం లేచి హాల్లోకి వెళ్ళింది. వరలక్ష్మికి ఏమి అనడానికీ మెదలకుండా వుండిపోయింది. కాంచన వెళ్ళి, అతని ర తొలగించి, నుదుటిమీద చెయ్యివేసి చూసింది. నిజం జ్వరంతో కాలిపోతోం దతనిఒళ్ళు.

''లేచి ముఖం కడుక్కోండి, కాఫీ త్రాగిపడుకుందు గాని !'' అంది. అతడు లేచివెళ్ళి ముఖం కడుక్కు వచ్చాడు. వరలక్ష్మి కాఫీ తెచ్చి స్టూలుమీద పెట్టిం కాఫీత్రాగి మళ్ళీ పడుకుని రగ్గు ముసుగుపెట్టాడు సారథ

కాంచన చెప్పులు తొడుక్కుని బయలు దేరింది. ''ఎక్కడికీ భోంచెయ్యకుండా?'' అన్నది వరలక్ష్మి. కాంచన బదులు చెప్ప కుండా వెళ్ళిపోయింది. అరగంటకల్లా డాక్టరును వెంటబెట్టుకు వచ్చింది.

డాక్టరు సారధికి యింజెక్షను యిచ్చి, మందులు వ్రాసిచ్చి వెళ్ళిపోయాడు. వరలక్ష్మికి ఒళ్ళంతా మంటగా వుంది. ''యిహ స్కూలుకు వెళ్ళవా ఏం?'' అంది.

''హెచ్. యం.కు డాక్టరింటినుండి ఫోన్ చేశాను- ఇవాళ సెలవుకావాలనీ, రేపు వచ్చి లీవులెటర్ యిస్తాననీ!'' అంది. మందులు తేవడానికి మళ్ళీ బైటకు వెళ్ళింది. ''భగవంతుడా నీ లీల!'' అనుకుంది వరలక్ష్మి.

ఆ రోజంతా కాంచనకు, సారధి తలమీద మంచు పెట్టడంతో, నుదుటిమీద వుడుకులాం పట్టీలు వేస్తూండడంతో, మూడుగంటల కోసారి టెంపరేచర్ చూడ్డంతో, జావ త్రాగించడంతో సరిపోయింది. ఒక్క రాత్రంతా సారధి కలవరిస్తూనే ఉన్నాడు. వరలక్ష్మి అయోమయంగా ''వాళ్ళవాళ్ళకు టెలిగ్రాం యిచ్చి తీసుకు వెళ్ళమనక యిదేమి వెట్టిచాకిరీ మనకు?'' అంది.

కాంచన బదులు చెప్పలేదు. నాల్గోరోజున టెంపరేచరు నార్మల్‌కు దిగింది. సారధి ముఖం కడుక్కోడానికి లేవబోయి తూలాడు. కాంచన చప్పున పట్టుకుంది. సారధి 'అయ్యో!' అన్నాడు బాధగా.

''ఫర్వాలేదు, నన్ను పరాయిదాన్ననుకోకండి,'' అంది కాంచన.

సారధి సంభ్రమంగా హసించి, ఆమె ముఖాన్ని పరీక్షగా చూస్తూ ''మీరు- నీవు- కాంచనవు?'' అన్నాడు. సారధికి జ్వరం తగ్గడమే కాంచన కెంతో సంతోషంగావుంది. అతడు తనను గురుపట్టడంతో పొంగిపోయింది. ''ఔను, నేనే'' అంది. సారధి ఏం మాట్లాడలేదు. కాఫీ త్రాగిన కాసేపటికి స్నానాలగదికి వెళ్ళాడు. వేడినీళ్ళు తొలిపి వున్నాయి. వంకెకు క్రొత్త పంచె, రెడీమేడ్ షర్టు, తువాలు కనిపించాయి. అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఒళ్ళు తుడుచుకుని క్రొత్తబట్టలు వేసుకుని హాల్లోకి వచ్చాడు. కాంచన అతని పక్కమీద దుప్పటీ, దిండుగలేబూ మారుస్తున్నది.

సారధి బల్లమీద పేపరు చేత్తో తీసుకుని ప్రక్కనేవున్న పడక్కుర్చీలో కూర్చున్నాడు.

పదిన్నరకు కాంచన ఉసిరికాయ పచ్చడి, పొట్లకాయకూర, మిరియాలచారుతో పథ్యపు భోజనం పట్టుకువచ్చి, అతనిముందుకు బల్ల జరిపి, బల్లమీద పెట్టింది. సారధికి నిగ్రహం పోయి కన్నీళ్ళు క్రిందకు జారాయి.

కాంచన హృదయం ద్రవించిపోయింది. 'ఏమిటి బెంగపడుతున్నారు? యింకో నాలుగురోజుల్లో మీ బలం మీకు తిరిగి వస్తుంది; లేచి తిరుగుతారు. నా మాట వినండి, భోంచెయ్యండి,'' అన్నది. సారధి యాంత్రికంగా భోజనం ముగించాడు.

తృప్తిగా లోపలకు వెళ్తూ ''యివాళ నిద్రపోకూడదు మీరు!'' అంది కాంచన. లోపలకు వెళ్ళి తనుకూడా భోజనం ముగించుకు వచ్చింది. సారధి కళ్ళు మూసుకున్నాడు.

''లెండిలెండి, పథ్యంతిని నిద్రిస్తే, మళ్ళీ జ్వరం వస్తుంది. నాకు మరి సెలవు దొరకదు,'' అంది కాంచన.

''అబ్బ! చాల నిద్ర వస్తూంది,'' అన్నాడు సారధి.

''పేకాడదామా పోనీ?'' అని లోపలకు వెళ్ళి పేక తీసుకు వచ్చి కలిపి తనే ముక్కలు పంచింది.

ఆ మర్నాడు వరలక్ష్మి రాములవారిగుళ్ళో కోటిఅర్చన చివరిరోజు వుత్సవం చూడ్డానికి వెళ్ళింది. సారధి హఠాత్తుగా ''కాంచీ! నువ్వు నన్ను అసలు ఎందుకు వదిలిపెట్టి వచ్చావో చెప్పవూ?'' అన్నాడు.

కాంచన దుఃఖం పట్టలేక చేతులలో ముఖం కప్పుకుంది.

''ఏడవవద్దు కాంచనా! ఏడేళ్ళనుంచీ ఆలోచిస్తున్నా, నాకు నిజం తెలియనేలేదు. ఇవాళ నువ్వు చెప్పితీరాలి!'' అన్నాడు.

కాంచనకు యిన్నేళ్ళుగా ఒంటరిగామోసిన ఆలోచనలను పంచుకోవాలనిపించింది.

''నాకూ, మా శేఖరం బావకూ ఆరేళ్ళవార!'' అంది కాంచన కథ మొదలు పెడుతూ. సారధి ముఖం నల్లబడిపోయింది. నిర్లిప్తంగా వినసాగాడు. కాంచన కిటికీలోంచి బైట తోటలో పూసిన పూలచెట్ల వంక చూస్తూ చెప్పసాగింది. ''బావ మెట్రిక్ తప్పినరోజున మావయ్య బావ బాదాడు. బావ యింట్లోంచి పారిపోయాడు. నాలుగేళ్ళ తర్వాత యింటికి వచ్చాడు.

మిలటరీ యూనిఫారమ్‌లో బావను చూసి నేను పొంగిపోయాను. నేను మెట్రిక్ పాసయిం తర్వాత చదువు మాన్పించారు నాన్న. మా పెద్దమేనత్త - అంటే శేఖరం బావ తల్లి కబురు పంపింది మా నాన్నకు, నన్ను తన కొడుకు కిమ్మని. మిలటరీలో చేరినవాడికి పిల్ల నివ్వనన్నాడు నాన్న. నేను ప్రేమ భంగం పొందినట్లు ఏడవలేను. నేను యిష్టపడింది బావ చొరవనూ, సాహసాన్నీ కాని, బావను కాదని నా కెప్పుడూ తెలుసు. సరే, నాన్నకు నచ్చిన సంబంధం స్థిరపర్చారు. మీతోటి సంసారం హాయిగానే వుండేది నాకు. ఒక ఏడాది సాఫీగానే దొర్లిపోయింది. మీకు గుర్తుందా - మీ అమ్మగారు తేలుమంత్రం పెట్టేవారు,'' అంది కాంచన.

సారధికితల్లి పెట్టేతేలుమంత్రానికీ, భార్య వెళ్ళిపోవడానికీ సంబంధం తెలియటలేదు. ''ఔను, అమ్మ యిప్పుడుగూడా పెడ్తుంది,'' అన్నాడు.

కాంచన మళ్ళీ కథ అందుకుంటూ, ''ఒకరోజు అరమైలు దూరంనుంచి మనింటికి ఒక ముసలమ్మ తేలుకుట్టిన మనుమణ్ణి నడిపించుకుంటూ వచ్చింది మంత్రం పెట్టించుకోడానికి. ఆరోజు అత్తయ్య వూళ్ళోలేరు. ఆ వృద్ధురాలు దిగాలుపడిపోయి, 'అయ్యో! నా కొడుకు వుంటే ప్రక్కబస్తీకి తీసికెళ్ళి డాక్టరుకు చూపించేవాడు. యిప్పు డేమిటి దారి?' అంటూ వాపోయింది. కాస్సేపటికి నిస్సహాయంగా మనుమణ్ణి నడిపించుకుంటూ వెళ్ళిపోయింది. మీ స్కూటర్ వున్నది యింట్లో! మీ రా అబ్బాయిని డాక్టరుదగ్గరకు పిలుచుకు వెళ్ళాలని అనుకున్నాను. యింత మాత్రం తట్టదా, నే నెందుకు చెప్పాలని నోరు విప్పలేదు నేను. ఆ ముసలమ్మ వెళ్ళిం తర్వాత మీ రంటే నాకు మొదటిసారిగా అసహ్యం కలిగింది. మీది పిరికితనమో, స్వార్థమో తెలియలేదు. క్రమంగా మర్చిపోయా నాసంగతి. ఇంకో రోజు- ఆనాడు అత్తయ్య కూడా వున్నారు-



సాయింత్రం ఆరింటికి, ఒక పసిబిడ్డతల్లి బస్సు తప్పిపోయిందని, ఆవూళ్ళో బంధువు లెవరూ లేరని, మనయింట్లో రాత్రి వుండి తెల్లారి వెళ్ళిపోతానని వచ్చింది. నాకూ, అత్తయ్యకూ ఆ బాలింతరాలికి ఒకరాత్రి ఆశ్రయ మివ్వడంలో ఆక్షేపణ కనబడలేదు. కాని మీరు 'ఇంకెక్కడైనా చూసుకో' మంటూ తలుపులు మూశారు. నేను కోపంగా ఎందుకట్లా చేశారని అడిగితే మీరు 'ఏపుట్టలో ఏపామున్నదో, యివాళ దయదలిచి పడుకో మంటాం. తెల్లవారేసరికి తల్లి మాయమై పిల్ల మిగిలితే ఏంచేస్తాం ?' అన్నారు. నాకు మీరంటే విపరీతమైన జుగుప్స కలిగింది. 'భగవంతుడా, నానుదుట నువ్వు వ్రాయ గలిగింది యిదేనా ?' అనుకున్నాను. ఆ రెండు సంఘటనలు నాకు తరచు గుర్తుకు వస్తుండేవి. మీరంటేనే నారక్తం తిరగ బడేది. ఆజుగుప్సను అణచుకుని మామూలుగా వుండడానికి ఒక్కోసారి ప్రాణసంకట మయ్యేది నాకు. అటువంటి రోజుల్లోనే ఒక సారి మీరు ఆఫీసుపనిమీద పొరుగూరు వెళ్ళారు. అత్తయ్య యాత్రలకు వెళ్ళారు. పనిమనిషి రంగమ్మవచ్చి పడుకునేది రాత్రిళ్లు నాకు తోడు. ఆసాయంత్రం శేఖరంబావ వచ్చాడు సెలవలో వచ్చాడట. నాపెళ్ళికి రాలేదు కనుక, వెళ్ళేముందు నన్నూ, మిమ్మల్నీ చూడ్డానికని వచ్చాడు. యింట్లో మీరూ, అత్తయ్యా లేరనేసరికి అప్పుడే వెళ్ళి పోతానని ప్రయాణంకట్టాడు. వున్నట్టుండి వాన మొదలయింది 'ఫరవాలేదు వెళ్తా నన్నాడు' 'వానలో బస్సుకూడా రాదీవూరికి. ఎట్లా వెళ్తావన్నాను' నేను. పెందలాడే భోజనాలు చేశాం. పనిమనిషికోసం ఎదురు చూశాను. ఆసాయంత్రం కొడుక్కు జ్వరం తగిలిందని రాలేదు రంగమ్మ. బావ ఒకటే బెంగపడిపోయాడు. వాననూ నన్నూ కలిపి తిట్టాడు. నేవెళ్ళి నాగదిలో పడుకున్నాను. తెల్లారాక బావ చెప్పాడు 'రాత్రంతా నిద్ర పట్టలేదనీ, చదువుకుంటూ కూర్చున్నాననీ.' వానవెలిసింది. కాఫీత్రాగి మొదటిబస్సు కెళ్ళి పోయాడు బావ. మీరువచ్చాక సంగతంతా చెప్పాను. 'అతను వెళ్తానన్నా నువ్వెందుకు ఆపావు ?' అన్నారు, అంతటితో ఆగక 'యింకెవరికైనా తెలుసా ?' అన్నారు, ఒళ్ళు మండిపోయిందినాకు. అన్నాళ్ళు నాతో కలిసివుండికూడ నన్ను సందేహించారు. మీకు అనుమానం కలిగాక, మరెవరికీ తెలియకపోతే సరిపెట్టుకుంటారా ?' నాకు చాల అసహ్యం కలిగింది మీ మీద. అసహనంగా మిమ్మల్ని ఏమేమో అన్నాను. మీక్కూడా కోపం అవధులుదాటింది. మాటలు తూలారు. పెట్టె సర్దుకుని పుట్టింటికి వెళ్ళాను, అమ్మ తిట్టింది. నాన్న 'అంత మాత్రానికి అనుమానిస్తాడా నిన్ను ? చదువుకున్నవాడు కాదూ ? నీకిష్టంలేకపోతే మళ్ళీ వెళ్ళకు,' అని నన్ను సమర్థిం చారు. మీరు కొన్నాళ్ళకు జాబు వ్రాశారు. నేను బదులియ్యలేదు. అం- మూడేళ్ళకు మనం చట్టబద్ధంగా విడిపోయ్యేం. తర్వాత ఏడాదికి మీరు పెండ్లి చేసుకున్నా రని విన్నాను. యింటిదగ్గర వూరికే వున్న మూ డేళ్ళల్లో హిందీ పరీక్షలకు కట్టి పాస య్యాను. నాన్న పోయింతర్వాత, ఇంట్లో వుండడం ఇష్టంలేక అత్తయ్యను వెంట బెట్టుకుని యీవూరు వచ్చి, స్కూల్లో హిందీ టీచరుగా వుంటున్నాను. అమ్మకు, అన్న య్యకు నామీద ఎప్పుడూ సానుభూతిలేదు," అంటూ పూర్తిచేసింది కథ.

"ఎంతపని చేశావు కాంచనా ? నేను నిజంగా నిన్ను సందేహించనేలేదు. నిన్ను




చాలా ప్రేమించాను నేను. నీ కాలికి ఎదురు దెబ్బ తగిలితే, కూరలుకోస్తు వ్రేలుకోసుకుంటే, వంట చేస్తూ చెయ్యి కాల్చుకుంటే, నా ప్రాణం విలవిలలాడిపోయేది. అటువంటిది నీ పేరుకు మచ్చవస్తే ఎట్లా సహించగలను? రాముడు సీతను అడవికి పంపి అయోధ్యలో ఆనందించా డంటావా? నువ్వు నిష్కళంకవని నాతోపాటు ప్రపంచంకూడ నమ్మాలని తహతహ లాడాను. అందుకే 'ఎవరికేనా తెలుసా,' అనడిగాను. వేరేమీ కాదు. కాని నువ్వు నన్ను రెచ్చగొట్టావు. నా నోట వెలువడిన మాటలు తలచుకుని తర్వాత నేను పడ్డ సిగ్గూ, బాధా ఎట్లా చెప్పను నీకు? దేనికీ వ్యవధి నివ్వకుండా నన్ను ఏకాకిని చేసిపోయావు నువ్వు. నా జాబు చదవకుండా చింపివేశావని విన్నాను. బదులివ్వలేదు. అమ్మ రోజూ ఏడుపు. ఒక్కగా నొక్క కొడుకు సంసారం యిట్లా భంగమైతే ఏడవక ఏం చేస్తుంది? ఆమె తృప్తికోసం, ఆమె కుదిర్చిన పిల్లను చేసుకున్నాను." సారథి కళ్లు చెమర్చాయి.

కాంచన బుగ్గలు తడిసిపోయాయి. ఆమె తన చెక్కిళ్ళు తుడుచుకోడం మర్చిపోయి, సారథికళ్ళు చెంగుతో తుడుస్తూ "మీ భార్య ఎట్లా వుంటుంది చెప్పరూ?'' అంది. సారథి జాలిగా చూస్తూ ''పేదయింటిపిల్ల; చదువూ, నాగరికతాలేని అమ్మాయి. నాకు భార్యగా వచ్చింది. చూడ్డానికి నీ కన్నా మెరుగే! స్త్రీలలో పద్మినీ జాతి స్త్రీ లుంటారని వింటాం. నా భార్య పనిమనుషుల్లో పద్మినీ జాతికి చెందినది. వంట అద్భుతంగా చేస్తుంది. ఇల్లెప్పుడూ పరిశుభ్రంగా వుంచుతుంది. 'నేను వూరెళ్తున్నా నంటే,' 'ఎందుకు' అని అడగదు. ఆలస్యంగా వస్తే 'ఏమ'ని అడగదు, అంతా నౌకర్ల మనస్తత్వం! అటువంటి ఇల్లాలితో కాపరంలోని కమ్మదనం గురించి కథలు వ్రాయమంటావా, పాటలు పాడ మంటావా?" అన్నాడు సారథి.

కాంచనకు జాలిలోకూడ కాస్త నవ్వు వచ్చింది. సారథీ నాలు గేళ్ళనాడు నీకు అమ్మవారు వచ్చి, రూపు చెడిందని విన్నాను. ఒక క్షణం మంచి శాస్తి జరిగింది' అనుకున్నాను. తర్వాత వారంరోజులు నువ్వే నా కలల్లో! నిన్ను చూడాలని ఎంత ఆరాటపడ్డాను. నా భార్యా, నా సంసారం, నా అంతరాత్మ అడ్డు నిలిచేయి. యిన్నాళ్ళకు నాకు రోగం వచ్చి, నీ సపర్యలు పొందడం, నాకు శాస్తి జరగడం లాంటిదే! కాని నాకిది దివ్యవరం లాగా వుంది కాంచీ! నిన్ను వదిలి వెళ్ళాలనిపించడంలేదు" అన్నాడు సారథి, ఆమె చెయ్యి గుప్పెట్లో పట్టుకుని, కాంచన అంతా విని, నిలువెల్లా వణికి పోయింది. ''నాకు దేవుడిచ్చిన అమృత కలశాన్ని నిర్లక్ష్యంగా జారవిడిచాను. కాని, నేను చేసిన పొరపాటుకు మీకు శిక్షపడటమే విచారంగా వుంది! మీరు నాదగ్గర వుంటానంటే ఎట్లా? రేపు రాత్రి మెయిల్లో వెళ్ళడానికి మీకు టికెట్టు బుక్ చేశాను. నేను చేసిన పాపం చాలు యీ జన్మకు!" అంది. దుఃఖం పట్టలేక బిగ్గరగా ఏడ్చింది.

"గుండెలో నాకోసం యింత ప్రేమ దాచుకుని, నన్నురిక్త హస్తాలతో వెళ్ళగొడ్తావా,'' అన్నాడు సారథి జాలిగా, ప్రేమగా.

కాంచన, ''నా దెంతటి ప్రేమైనా మీకు అపథ్యాహారంలాంటిదే అవుతుంది. నన్ను మనసారా క్షమించండి అదే చాలునాకు''అంది.

వెళ్ళేప్పుడు సారథి పాతబట్టలు కట్టుకున్నాడు. కాంచన రోషంగా ''ఓహో, నేను యిచ్చిన బట్టలు పనికిరావు కాబోలు! ఫరవా లేదు వుండనివ్వండి. మళ్ళీ నా యింటికి ఎవరైనా వానలో తడిసి వస్తే వుపయోగపడతాయి,'' అంది. సారథి కళ్ళు చెమర్చగా నవ్వి, "కాంచీ, నీ రోషకషాయిత నేత్రాలు, నీ పరుష భాషణాలు నాకెప్పటికీ లేకుండా చేశావు కదా! ఆడవాళ్లు పెళ్ళిచీర దాచుకుంటారు చూడు, అట్లా దాచుకుంటాను, నువ్విచ్చిన బట్టలు. అవి రైల్లో మాసిపోకూడదు,'' అన్నాడు. సారథి ఎక్కిన రైలు కదిలిపోయింది. ''నా చేతులారా, నా సర్వస్వమూ పోగొట్టుకున్నాను. దేవుడా! నువ్వు చాల దయగలవాడివి! నేను పారవేసుకున్నా ననుకున్నది నా దగ్గరే వున్న దిన్నాళ్లు! దాని వెలుగు యివాళే గుర్తించాను!'' అనుకుంది కాంచన.

———